పడకేసిన పారిశుధ్యం



పల్లెల్లో తగ్గని ప్లాస్టిక్ కవర్ల వినియోగం



ఐ.పోలవరం మండలం కేశనకుర్రు రోడ్డు చెంతనే చెత్త



అమలాపురం మండలం బండారులంకలో మెయిన్ రోడ్డు పక్కన చెత్త

- పలు పంచాయతీల్లో డంపింగ్ యార్డుల్లేవు
- పారిశుధ్య సిబ్బంది కొరత
- రోడ్ల పక్కనే గుట్టలుగా చెత్త చెదారం
- డ్రెయిన్లలో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర చిత్తశుద్ధి కరువు

ఐ.పోలవరం: గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. పారిశుధ్య నిర్వహణలోపం కారణంగా పట్టణాలు, పల్లెల్లోని వీధులు మురికికూపాలను తలపిస్తున్నాయి. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై కూటమి ప్రభుత్వం ఊదరగొడుతూ ఆర్భాటంగా వాడవాడలా ప్రచారం చేయడం తప్ప చిత్తశుద్ధితో కార్యాచరణ చేపట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పల్లెల్లో వీధులు చెత్తాచెదారం లేకుండా చేద్దాం, రోడ్లను పరిశుభ్రంగా ఉంచుదాం, డ్రెయిన్లలో నీరు నిల్వ ఉండకుండా చేసి దోమలను అరికడదాం, ప్లాస్టిక్ కవర్ల వినియోగం, అమ్మకాలను నిలువరిద్దామంటూ సీఎం చంద్రబాబు, ప్రభుత్వ యంత్రాంగం ప్రకటనలకే పరిమితమవుతున్నారని పలువురు అంటున్నారు. ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలో పారిశుధ్యం పడకేసిందని అక్కడి వీధులను చూస్తే అర్థమవుతుంది. అపరిశుభ్రతతో నిండిన మున్సిపాలిటీలోని వార్డులను, పంచాయతీలను పరిశీలిస్తే ప్రభుత్వం చెబుతున్న స్వచ్ఛాంధ్ర అసాధ్యమని తేలిపోతుందని పలువురు అంటున్నారు.

డంపింగ్ యార్డులేవీ?

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీలతో పాటు ఏడు మండలాల్లో 123 పంచాయతీలున్నాయి. మూడొంతుల పంచాయతీలకు డంపింగ్ యార్డులు లేవు. దాదాపు సగం పంచాయతీల్లో ఉండాల్సిన స్థాయిలో పారిశుధ్య కార్మికులు లేరు. చెత్తను తరలించేందుకు అవసరమైన ట్రాక్టర్లు, రిక్షాలు, ఇతర వాహనాలు లేవు. డ్రెయిన్లలో నిల్వ ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, పేరుకుపోయిన చెత్త, పూడికను చాలా పంచాయతీల్లో ఏడాదికి ఒకసారి తీయడం కూడా గొప్పే. అటువంటప్పుడు పంచాయతీలను పరిశుభ్రంగా ఎలా ఉంచుతారనేది తెలియడం లేదని పలువురు అంటున్నారు.

ఆగని ప్లాస్టిక్ వినియోగం

అన్ని పంచాయతీల్లోనూ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని అధికారికంగా నిషేధించారు. అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీలతోపాటు ఎక్కడా ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గలేదు. ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న దుకాణాల్లో బహిరంగంగా ప్లాస్టిక్ కవర్లను వినియోగించడంతోపాటు విక్రయిస్తున్నా పట్టించుకునే వారు లేరు. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే కూటమి ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర అంటూ ప్రచారం ఊదరగొట్టడం విడ్డూరంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు.

ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల్లో..

- ఐ.పోలవరం మండలంలో 14 పంచాయతీలుండగా ఐదు పంచాయతీలకు మాత్రమే డంపింగ్ యార్డులున్నాయి. అతి పెద్ద పంచాయతీ మురమళ్లలో గోదావరి చెంతనే డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. ఏడు పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు లేరు.
- తాళ్లరేవు మండలంలో 17 పంచాయతీల్లో 10 పంచాయతీలకు డంపింగ్ యార్డులు లేవు. 14 పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాలుండగా, వాటిలో మూడొంతులు మూలనపడ్డాయి.
- కాట్రేనికోన మండలంలో 16 పంచాయతీలుండగా ఎక్కడా డంపింగ్ యార్డులు లేదు. పల్లంకుర్రు, కందికుప్ప, చెయ్యేరు, కాట్రేనికోన పంచాయతీలకు మాత్రమే పారిశుధ్య కార్మికులున్నారు. ముమ్మిడివరం మండలంలో 16 పంచాయతీలకు ఒక్క అనాతవరం పంచాయతీలో మాత్రమే డంపింగ్ యార్డు వినియోగంలో ఉంది.
- అమలాపురం నియోజకవర్గం పరిధిలో అమలాపురం మండలంలో 22 పంచాయతీలకు 14 చోట్ల మాత్రమే డంపింగ్‌యార్డులున్నాయి.
- కామనగరువు మేజర్ పంచాయతీకి డంపింగ్ యార్డు లేకపోవడం గమనార్హం. అతి పెద్ద పంచాయతీ బండారులంకలో చెత్త తరలింపు సమస్య అధికంగా ఉంది. సమీపంలో ఉన్న మున్సిపాలిటీ పరిధిలో చెత్త డంప్ చేయడంతో అక్కడి అధికారులు అడ్డుకుంటున్నారు. స్థానికంగా డంపింగ్ యార్డు సమస్య ఉండడంతో రోడ్ల వెంబడి చెత్త వదిలేస్తున్నారు. వీధుల్లోనే చెత్తకు నిప్పు పెడుతున్నారు. ఈ మంటల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు కాలుతూ విష వాయువు పెద్ద ఎత్తున గాలిలో కలుస్తోంది. దీని వల్ల ఆయా వీధిల్లో స్థానికులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది.
- అల్లవరం మండలంలో 21 పంచాయతీలుండగా 10 పంచాయతీలకు డంపింగ్ యార్డులు లేవు.
- ఉప్పలగుప్తం మండలంలో 17 పంచాయతీలకు పది పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు లేరు. ఒక్క డంపింగ్ యార్డు కూడా లేదు.

తాగునీటి కోసం కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ వద్ద అనాతవరం మహిళల ధర్నా

అమలాపురం రూరల్: మంచి నీళ్లు ఇప్పించండి మహాప్రభో అంటూ ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన మహిళలు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. జీఎంసీ బాలయోగి, కాలనీ, పెయ్యిలవారి పేటలో కుళాయిల ద్వారా నీళ్లు రాక చాలా ఇబ్బందులు పడుతున్నామని వారన్నారు. బోర్ల ద్వారా, నూతిలో ఉప్పునీళ్లు, నాచు కట్టిన నీళ్లు రావడంతో అవస్థలు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం చుట్టూ ఆక్వా చెరువులున్నాయని, వాటి వల్ల నీటి వనరులన్నీ కలుషితమయ్యాయని వారన్నారు. సర్పంచ్ మిమ్మితి చిరంజీవికి, సెక్రటరీకి ఎన్నిసార్లు మొరపెట్టినా మా గోడు వినిపించుకోవట్లేదని మహిళలు ఆరోపించారు. తాగునీరు సరఫరా చేయాలని కలెక్టరేట్‌లో డీఆర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బాధితులు బుడితి సత్యవతి, విత్తనాల దీప్తి, తాడి వెంకటలక్ష్మి, కుంచే నాగవేణి, కుమ్మరి ధనలక్ష్మి, సత్యవతి, మంగాదేవి, నెల్లి దుర్గ, పెయ్యల శ్యామల, విత్తనాల శ్రీలత, పాలమూరి పల్లాలమ్మ, కాళ్ల కనకదుర్గ, కుంచే గంగాభవాని, నాయకులు బుడితి వైకుంఠం, చొల్లంగి కన్నా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీకి వినతిపత్రం



ఎంపీ హరీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు తదితరులు

అమలాపురం టౌన్: కోనసీమలో పరిధిలో వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొబ్బరి దింపు, ఒలుపు కార్మిక మహానాడు సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు ఎంపీ గంటి హరీష్ మాధుర్‌కు వినతిపత్రం అందజేశారు. అమలాపురంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో హరీష్‌ను నాగేశ్వరరావుతోపాటు కొబ్బరి కార్మిక నాయకులు సోమవారం కలసి సమస్యలు వివరించారు. అంతర్వేదిలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఉండడంతో పాటు భవిష్యత్తులో డ్రెజ్జింగ్ హార్బర్ రానున్న దృష్ట్యా ఈ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని కోనసీమలో విమానాశ్రమం నెలకొల్పాలని ఎంపీని కోరారు. అంతర్వేది నుంచి సముద్ర మార్గం ఏర్పాటు, కోనసీమలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. 50 ఏళ్ల వయస్సు దాటిన కొబ్బరి కార్మికులకు పింఛన్ అందించాలని కోరారు. కోనసీమలో కొబ్బరి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేయాలని నాగేశ్వరరావు ఎంపీని కోరారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలని ధర్నా



యానాంలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఆర్‌ఏఓ ఆఫీసు వద్ద ధర్నా

యానాం: రెండు నెలలుగా యానాం పరిధిలో చెత్త సేకరణ ఆగిపోవడంతో వీధులన్నీ అపరిశుభ్రతతో దుర్గంధభరితంగా మారాయని, రోడ్లపై కొండలా చెత్త పేరుకుపోయిందని తక్షణం డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఆర్‌ఏఓ ఆఫీసు వద్ద కాంగ్రెస్, వీసీకే పార్టీ నాయకులు, పర్యావరణ కమిటీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం పట్టణంలో పేరుకుపోయిన చెత్తను తోపుడు బండ్ల ద్వారా ఆర్‌ఏఓ ఆఫీసు వద్ద వేయడానికి ఆందోళనకారులు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ సందర్భంగా నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి మాట్లాడుతూ కొన్ని నెలలుగా చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోయినా స్థానిక ప్రజాప్రతినిధి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రెండు వారాల్లోపు చెత్త సమస్యను పరిష్కరించాలని అధ్యక్షుడు అర్ధాని దినేష్ హెచ్చరించారు. అధ్యక్షుడు అర్ధాని దినేష్, వీసీకే నేత మెల్లం చిన్న, ఏఐడీఎంకే కార్యదర్శి మంచాల సాయికుమార్, అనితశ్రీ, సీపీఎం నేత దుర్గాప్రసాద్, సావిత్రినగర్ యువత అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

యానాం: జాతీయ విద్యా విధానంలో–2020లో భాగంగా అటల్ ఇక్యూబేషన్ సెంటర్, పుదుచ్చేరి ఇంజినీరింగ్ కళాశాల ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఇంటర్వ్యూ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ట్రైనర్ పి.వేణుగోపాలరావు విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, కోఆర్డినేటర్ ఏవీవీఎస్ మూర్తి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కమిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి రక్తదానం

అమలాపురం టౌన్: ఆపదలో ఉన్న వారికి ముఖ్యంగా రక్తం అత్యవసరమైన రోగులు, క్షతగాత్రులకు అమలాపురం ఆజాద్ ఫౌండేషన్ చేయూతగా నిలిచి తమ వంతు సహాయ సహకారాన్ని అందిస్తోందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు యల్లమిల్లి నాగసుధాకొండ అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ఓ రోగికి అత్యవసర శస్త్రచికిత్స సందర్భంగా రక్తం అవసరమైతే తమ ఫౌండేషన్ సభ్యుడు దంగేటి వెంకటరమణ సోమవారం రక్తదానం చేశారని నాగసుధాకొండ తెలిపారు. ఇప్పటికి పది సార్లు రక్తదానం చేసిన వెంకటరమణను ఈ సందర్భంగా అభినందించారు. రక్తం దానం చేసేందుకు తమ ఫౌండేషన్ సభ్యులు సిద్ధంగా ఉంటారని తెలిపారు.


అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సంస్కరణలు



అమలాపురంలో అంబేడ్కర్ జయంత్యుత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

అమలాపురం టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జ్ఞాపకాలను పదిలం చేసి ఆయనకు సమోన్నత గౌరవాన్నిచ్చిందని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ గుర్తు చేశారు. అమలాపురం గంగరాజు ఫంక్షన్ హాలులో జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అంబేడ్కర్ జయంత్యుత్సవాల ముగింపు సభకు కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో మేధావులు, పార్టీ సీనియర్ నాయకులు ప్రసంగించారు. సాగింది. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముళ్లపూడి రేణుక, మానేపల్లి అయ్యాజీ వేమా మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలనా పరంగా చేసిన సంస్కరణలను వివరించారు. బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్‌కుమార్, తమలంపూడి రామకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా పూర్వపు అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు ప్రసంగించారు. అమలాపురంలోని పార్టీ జాతీయ నాయకుడు పవన్‌కుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బారావు కేంద్ర మంత్రిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు కర్రి చిట్టిబాబు, ఆకుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైద్యులు

అమలాపురం టౌన్: రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ జ్ఞాని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశంలో అనేక ప్రజాస్వామ్య సంస్కరణలు ఆవిష్కరించారని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.శంకరరావు అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన అంబేడ్కర్ జయంత్యుత్సవాల ముగింపు కార్యక్రమంలో డాక్టర్ శంకరరావు మాట్లాడారు. అక్కడ ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు, సామాజిక కార్యకర్త వలవల శివరావు, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి నల్లా చిట్టిబాబు, ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ అనూష, ఆస్పత్రి వైద్యులు రాంజీ,చంద్రశేఖర్, అన్నపూర్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి



బడి బాట ప్రచారాన్ని ప్రారంభిస్తున్న ఆర్జేడీ, డీఈవో, ఏపీ టీఎఫ్ యూనియన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) నాగమణి తల్లిదండ్రులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీ టీఎఫ్ –1938) జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక రాతి బడి వద్ద బడి బాట కార్యక్రమాన్ని ఆర్జేడీ జెండా ఊపి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి స్వేచ్ఛాయుత విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు దృష్టి సారించాలని పేర్కొన్నారు. బడి బాటను ప్రోత్సహిస్తూ ఏపీ టీఎఫ్ జిల్లా శాఖ ప్రత్యేక ఆటో ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం చేయడంపై టీఎఫ్ యూనియన్ ప్రతినిధులను ఆమెను అభినందించారు. డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. యూనియన్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎన్ఎస్ మునేశ్వరరావు ఆధ్వర్యంలో బడిబాట ప్రచార కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమంలో డీసీసీబీ సెక్రటరీ భీర హనుమంతరావు, అల్లవరం ఎంఈవో కె.కిరణ్‌బాబు, ఏపీ టీఎఫ్ యూనియన్ నాయకులు గుత్తాల వెంకటేశ్వరరావు, జేవీవీ సత్యనారాయణ, ఎమ్. నాగ భూషణం, ఎస్.శ్రీనివాస్, వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలి



కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మాలమహానాడు నాయకులు

అమలాపురం రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కలెక్టరేట్ వద్ద రాక్స్ అండ్ మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు కొంకి వెంకటరావు ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. రాక్స్ అండ్ మాల మహానాడు నేషనల్ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ ఆధ్వర్యంలో మాల మహానాడు నాయకులు దీక్షల్లో పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌ను వెంటనే రద్దు చేయాలని, లేకుంటే జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందంటూ డాక్టర్ ఆర్.ఎస్ రత్నాకర్ హెచ్చరించారు. అనంతరం డీఆర్ఓలకు వినితిపత్రం అందించారు. చీకురుమెల్లి కిరణ్‌కుమార్, వరలక్ష్మి, నరసింహారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా సత్తెమ్మతల్లి విగ్రహం పునఃప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో సత్తెమ్మతల్లి

ఉప్పలగుప్తం: పెదగాడవిల్లిలో సత్తెమ్మ తల్లి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పండితులు కొమాళ్లపల్లి కాశీ విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదమంత్రాలతో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. అమ్మవారి విగ్రహాన్ని శిల్పి నల్లా చిట్టిబాబు బహూకరించారు. కమిటీ సభ్యులు అమ్మవారిని అందంగా అలంకరించి పూజలు అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

జీతాలు మంజూరు చేయాలి



ఉప్పలగుప్తంలో ఏవో కుమార్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న పీసీసీ సిబ్బంది

ఉప్పలగుప్తం: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టీఏ, డీఈఓ, సహాయకులుగా పనిచేసిన సిబ్బందికి ప్రభుత్వం జీతాలు అందించి ఆదుకోవాలని వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబుకు పీసీసీ సిబ్బంది సోమవారం కార్యాలయంలో వినతిపత్రాన్ని అంజేశారు. సీజన్ ముగిసి నెలలు కావస్తున్నా జీతాలు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం సేకరణలో రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా కృషి చేసి, ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా కర్తవ్యాన్ని నెరవేస్తున్నామని వారన్నారు. ప్రభుత్వం సక్రమంగా వేతనాలు అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పౌరసరఫరాల అధికారులు స్పందించి వేతనాలు ఇప్పించాలని వారు కోరారు.

దళితుల సాంఘిక బహిష్కరణ అమానుషం

ఐ.పోలవరం: సాక్షాత్తు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గం పిఠాపురానికి సమీపంలో మల్లం అనే గ్రామంలో దళితుల సాంఘిక బహిష్కరణ ఘటన చోటు చేసుకోవడం అత్యంత దారుణమని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ దళిత నాయకులు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ కనీసం నిత్యావసర సరుకులు కూడా దళితులకు విక్రయించకపోవడం అనాగరికమని ఈ విషయంపై విచారణ చేసి సంబంధించిన దోషులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాకినాడ కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సీఎం చంద్రబాబు దీనిపై స్పందించాలని నాయకులు తాళ్లూరి ప్రసాద్, మచ్చా నాగబాబు, నాతి నాగేశ్వరావు తదితరులు కోరారు.

కారుకు అద్దె చెల్లించని ముగ్గురిపై కేసు

అమలాపురం టౌన్: ఓ కారును అద్దెకు తీసుకుని వెళ్లి అద్దె చెల్లించకపోవడమే కాకుండా కారును ధ్వంసం చేశారన్న అభియోగంపై అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. అమలాపురం మండలం ఈదరపల్లికి చెందిన కారు యాజమాని గుబ్బల సిద్ధి గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన గల్లా శివ, అరిగెల శివ, అంబాజీపేటకు చెందిన ఆదిత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. నిందితులు ముగ్గురూ కారు అద్దెకు తీసుకుని వెళ్లి పాడు చేయడమే కాకుండా అద్దె చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని సిద్ధి గణేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడని సీఐ చెప్పారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



చల్లపల్లిలో రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం: చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సీఎస్ఆర్ నిధులతో రూ.కోటితో నిర్మించే చల్లపల్లి–కాట్రేనికోన ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై నిర్మాణం చేపట్టే బీటీ రోడ్డు పనులకు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలాపురం ఎర్రవంతెన నుంచి చల్లపల్లి ప్రధాన పంట కాలువకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించి రహదారుల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, ఆర్అండ్‌బీ డీఈ బీవీఎస్ వర్మ, మాజీ ఎంపీటీసీ బూసి బుజ్జిదొర పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మించాలని గ్రీవెన్స్‌లో అర్జీ

ఉప్పలగుప్తం: విలసవిల్లి వీవర్స్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆ ప్రాంతంలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు నిర్మించాలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అధికారులకు అర్జీ అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండలస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాన్ని ఎంపీడీవో పీఆర్‌సీ రాజ్‌కుమార్‌కు సర్పంచ్ అందజేశారు. తమ గ్రామంలో సుమారుగా 7వేల మంది జనాభా నివసిస్తున్నారని గ్రామంలో ఓహెచ్ఎస్ఆర్ ఉన్నప్పటికీ శివారు ప్రాంతమైన వీవర్స్ కాలనీకి తాగునీరు అందటం లేదన్నారు. ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించి గతంలో రూ.30 లక్షలు మంజూరైనప్పటికీ, సంబంధిత పత్రాల్లో ప్రదేశం వేరుగా రావటంతో పనులు నిలిచిపోయాయని సర్పంచ్ తెలిపారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆమె కోరారు.

విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలపై వినతి

ముమ్మిడివరం: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్‌లో అధికారులకు వినతిపత్రం అంజేశారు. 2018 నుంచి రావల్సిన డీఆర్, సరెండర్ లీవులు, ఇతర మెడికల్ బిల్లుల బకాయిలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెక్చరర్ల తరపున విశ్రాంత ప్రిన్సిపాల్ కోలా వెంకటేశ్వరరావు, విశ్రాంత లెక్చరర్ బొక్కా విష్ణుమూర్తి, జనిపెల్ల సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రెడ్డి వీరాస్వామి, పెద్దిరెడ్డి రాము, పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

పాఠశాలలో కుళాయి ట్యాప్‌ల చోరీ

తాళ్లరేవు: జి.వేమవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం రాత్రి 15 కుళాయి ట్యాప్‌లను దొంగలు అపహరించుకుపోయారు. పాఠశాలలోని విద్యార్థులు మంచినీరు తాగేందుకు ఉపయోగపడే ట్యాంక్‌కు ఉన్న స్టీలు ట్యాప్‌లను అపహరించారని స్థానికులు తెలిపారు. ఇది ఆకతాయిల పనా, లేక దొంగలే అపహరించారా? అని స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు ఆరా తీస్తున్నారు. పిల్లలు మంచినీరు తాగే ట్యాప్‌లు చోరీకి గురికావడం గ్రామంలో చర్చనీయాంశమైంది. మందుబాబులు డబ్బులు కోసం ఈ పనికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు హైస్కూల్ హెచ్ఎం వి.విజయలక్ష్మి కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేసారు. హైస్కూల్ చెంతనే ఉన్న ప్రాథమిక పాఠశాలలోని ట్యాప్‌లను కూడా అపహరించారని స్థానికులు తెలిపారు.

ఉగాది పురస్కార గ్రహీత ఏడుకొండలుకు సత్కారం

ముమ్మిడివరం: ఇటీవల రాజమండ్రిలో నిర్వహించిన ఉగాది నంది అవార్డు ప్రదానోత్సవంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్న విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలును ముమ్మిడివరంలో సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో విశ్వజన కళామండలి సభ్యులు, ఇతర సంఘాలు సభ్యులు ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షురాలు మెండి కమల, రాష్ట్ర కార్యదర్శి ఏడ్ల సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గెడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

అమలాపురం రూరల్: కామనగరువు మాజీ సర్పంచ్ దివంగత రాజులపూడి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారులు మురళీకృష్ణ, సుబ్బారావు గౌడ్ స్థానిక హైస్కూల్లో విద్యార్థులకు రూ. 20,000 విలువైన 30 జతల క్రీడా యూనిఫాం బహూకరించారు. సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రాజులపూడి వెంకటేశ్వరరావు (భీముడు) ఉప సర్పంచ్, రాజులపూడి భాస్కరరావు, రాజులపూడి సత్యనారాయణ సోమవారం విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించారు. వార్డు మెంబరు కామన సత్యనారాయణ, స్కూల్ చైర్మన్ కోమటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎకరానికి 45 బస్తాల ధాన్యం దిగుబడి

అల్లవరం: దాళ్వాలో ఎకరానికి సగటున 45 బస్తాల దిగుబడి సాధించామని వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. బోడసకుర్రులోని వ్యవసాయ క్షేత్రంలో పంట దిగుబడి అంచనాపై క్రాఫ్ కంటింగ్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈ ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చాయన్నారు. పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాలు అమ్ముకుని ప్రభుత్వం నిర్దేశించిన గిట్టుబాటు ధరను పొందాలని సూచించారు. క్వింటాల్‌కు రూ.2,300, 75 కేజీల బస్తాకు రూ.1,725 చొప్పున రైతులకు చెల్లిస్తామన్నారు. ఏఎస్ఓ సూర్యనారాయణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ బాలకృష్ణ పాల్గొన్నారు.

సోనియా, రాహుల్ గాంధీని అరెస్టు చేయాలి

అమలాపురం రూరల్: స్వతంత్ర సమరయోధులు 5వేల మంది భాగస్వాములుగా ఏర్పడిన నేషనల్ హెరాల్డ్ మీడియా సంస్థకు కేవలం రూ.50 లక్షలు అప్పు ఇచ్చినట్లు చూపించి, దాదాపుగా రూ. 5వేల కోట్ల విలువ చేసే దేశవ్యాప్తంగా ఉన్న ఆ సంస్థ ఆస్తులను హస్తగతం చేసుకున్నందుకు 2013లో ఈడీ నమోదైన కేసులో నిందితులుగా ఉన్న కాంగ్రెస్ జాతీయ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని వెంటనే అరెస్టు చేయాలని అమలాపురం గడియార స్తంభం వద్ద బీజేపీ యువమోర్చా నాయకులు సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీ పిలుపుమేరకు కోనసీమ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్ గౌడ్, భారతీయ జనతా యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు జగత శాంతి, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యం వహించారు. కోనసీమ జిల్లా భాజపా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాసిన ఫణేంద్ర, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరు సత్యానందం తదితరులు పాల్గొన్నారు.